క్లుప్తంగా

బీజేపీ విశాఖ జిల్లా ఇన్‌చార్జిగా పుట్టా గంగయ్య



మాడుగుల రూరల్: బీజేపీ సీనియర్ నాయకుడు పుట్టా గంగయ్య విశాఖ జిల్లా ఇన్‌చార్జిగా నియమించారు. ఇప్పటికే ఆయన ఈ పదవిలో కొనసాగుతున్నప్పటికీ పార్టీ నూతన రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తిరిగి అన్ని జిల్లాల అధ్యక్షులను పునర్నియమించారు. దీనిలో భాగంగా జిల్లా ఇన్‌చార్జిగా తనను నియమించినట్లు మాడుగులలో ఆయన శనివారం తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈయన సీనియారిటీని గుర్తించి పార్టీ విశాఖ జిల్లా ఇన్‌చార్జిగా కొనసాగించడంపై మాడుగుల నియోజకవర్గ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు వినాయక విగ్రహ ప్రతిష్ట



పూజల కోసం పనులు చేయిస్తున్న సంఘ సభ్యులు

రోలుగుంట: ఈ నెల 18న వినాయక చవితి పురస్కరించుకుని నవరాత్రోత్సవాల కోసం స్థానిక జీవకారుణ్య సంఘం భవనం వద్ద జీవకారుణ్య సంఘం, అనుబంధ సిద్ధి వినాయక సంఘ సభ్యులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా ఇక్కడ భవనంలో వినాయకుడిని ఆదివారం ప్రతిష్ఠించేందుకు సభ్యులు నిర్ణయించారు. ఈ మేరకు శుక్ర, శనివారాలు సంఘ సభ్యులు తమరాన సతీష్, ఆడారి గణేష్ చోప్రా తదితరులు శ్రమదానంతో అవసరమైన పనులు చేశారు. నేడు జరగనున్న పూజా కార్యక్రమాలకు సంఘ సభ్యులందరూ విధిగా పాల్గొనాలని వారు కోరారు.

ప్రైవేటు భవనంలోకి ఒమ్మలి పీఏసీఎస్ తరలింపు



భవనం ప్రారంభోత్సవంలో సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి భాస్కరరావు

మాడుగుల రూరల్: ఒమ్మలి పీఏసీఎస్ భవనం శిథిలావస్థకు చేరడంతో ప్రైవేటు భవనంలోకి శనివారం తరలించారు. ఈ భవనంలో సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి బొద్దాపు భాస్కరరావు కొబ్బరికాయ ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు పల్లె రామునాయుడు, సీఈవో నందారపు వెంకటరమణ, వార్డు సభ్యులతో పాటు పూసర్ల బుజ్జి, దొర పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న వైస్ ఎంపీపీ మత్స భవానీప్రసాద్

రావికమతం: దోలవానిపాలెంలో 20వేల లీటర్ల సామర్థ్యం కలిగిన మంచినీటి ట్యాంకు నిర్మాణానికి వైస్ ఎంపీపీ మత్స భవానీప్రసాద్ శనివారం భూమిపూజ చేశారు. టి.అర్జాపురం శివారు గ్రామమైన దోలవానిపాలెంలో ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుకు విప్ కరణం ధర్మశ్రీ రూ.29.99 లక్షలు మంజూరు చేయించారు. ఇక్కడ తాగునీటి పైపులైన్లు ఏర్పాటుతోపాటు 20 వేల లీటర్ల ట్యాంకు నిర్మించనున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇల్లపు సన్యాసినాయుడు, రామునాయుడు, రమేష్‌నాయుడు, రమణ తెలిపారు.

'మట్టి గణపతినే పూజిద్దాం'

అనకాపల్లిటౌన్: మట్టి గణపతినే పూజిద్దాం.. పర్యావరణహితంగా వినాయక చవితి జరుపుకుందాం...ప్రకృతిని పచ్చగా పది తరాలకు అందిద్దాం..ఈనెల 17వ తేదీన స్థానిక జీవీఎంసీ పెద్ద హైస్కూల్ వద్ద గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా మట్టిగణపతుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషన్ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 3500 మట్టి వినాయక విగ్రహాలు, వినాయక వ్రతకథ పుస్తకాలు, పసుపు, కుంకుమ, పటిక ఉచితంగా పంపిణీ చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

చంద్రబాబు 'స్కిల్' స్కాం

- 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఇదేనా?
- అధికారాన్ని అడ్డం పెట్టుకుని దోపిడీయా?
- సర్వత్రా ప్రజాగ్రహం

ఇంటికో ఉద్యోగం, యువతకు నిరుద్యోగ భృతి ఇస్తానని.. రైతులకు, డ్వాక్రా మహిళలకు రుణాల మాఫీ చేస్తానని.. ఇలా గంపగుత్తగా బూటకపు హామీలిచ్చి మోసం చేసిన చంద్రబాబు అధికారాన్ని అడ్డం పెట్టుకుని భారీ దోపిడీ పర్వానికి తెరలేపాడు. యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తామంటూ భారీ అవినీతికి పాల్పడిన వ్యవహారం బట్టబయలు కావడంతో పాటు ఆయన్ను సీఐడీ అరెస్టు చేయడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ప్రజాధనాన్ని దోచుకున్న ఎంతటి వారైనా చట్టం ముందు సమానమే అని పలువురు తమ అభిప్రాయాలు సాక్షితో పంచుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

చట్టానికి అందరూ సమానమే..



స్కిల్ డెవలప్‌మెంటు కేసుపై 2017 నుంచి సీఐడీ దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో ఈడీ ఇప్పటికే పలువురిని అరెస్ట్ చేసింది. ఇంకా విచారణ చేయాల్సి ఉంది. ప్రజల సొమ్ము ఎవ్వరూ దోపిడీ చేయకూడదు. దోపిడీ జరిగిందని తెలిసి విచారణ చేస్తున్నారు. చట్టానికి అందరూ సమానులే.. సహకరించాల్సిందే. దీనిపై రాజకీయం మానుకోవాలి.

– గట్రెడ్డి అప్పారావు, ఎల్ఐసీ జెడ్ఎం క్లబ్ మెంబర్, రావికమతం

ప్రజలను మోసం చేసిన చంద్రబాబు



ప్రజలను మోసం చేసి స్కిల్ డెవలప్‌మెంట్ నిధులను చంద్రబాబు దోచుకోవడం దారుణం. అప్పటి ముఖ్యమంత్రి హోదాలో ఈ విధంగా ప్రజాధనాన్ని పక్కదారి పట్టించి రాష్ట్ర ప్రజలను మోసం చేశారు. సీఐడీ అధికారులు పక్కా ఆధారాలతో ఆయన్ను అరెస్ట్ చేయడం సమంజసమే.

– తత్రా మోహన్‌రావు, యువ రైతు, ఎ.భీమవరం, కె.కోటపాడు మండలం

అవినీతి ఎప్పడైనా తేటతెల్లం



తాను నీతి నిజాయతీ అని పగల్బాలు పలికిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అరెస్టు చేయడం వెనుక ప్రభుత్వం ఉందనడం విడ్డూరంగా ఉంది. ప్రజల సొమ్ము పంచుకున్న నిజాలు సీఐడీ బయట పెట్టడంతో నిజాయతీ గురించి చెప్పుకుంటున్న చంద్రబాబునాయుడు ఎందుకు భయపడుతున్నారు. ఎంతటి వారైనా అవినీతికి పాల్పడితే తేట తెల్లమవుతుందనడానికి చంద్రబాబు ఘటన నిదర్శనం.

– కర్రి కన్నంనాయుడు, రైతు, ముకుందపురం, మాడుగుల మండలం

కక్ష సాధింపు ఆరోపణలు హాస్యాస్పదం



స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో పక్కా ఆధారాలతోనే చంద్రబాబును సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. దోపిడీ చేసి అడ్డంగా దొరికిపోయి ప్రభుత్వ కక్ష సాధింపు చేస్తుందని ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉంది. యువతకు శిక్షణ పేరిట కోట్లాది రూపాయలు ప్రజాధనం లూటీ చేసినట్లు సీఐడీ విచారణలో తేలింది. తప్పు చేయకుంటే చంద్రబాబుకు భయమెందుకు, కోర్టులో నిర్దోషిగా నిరూపించుకోవాలి. సమగ్ర విచారణ తర్వాతనే అధికారులు అరెస్టుకు ఉపక్రమించారు. చంద్రబాబు అవినీతి చేసినట్లు రాష్ట్ర ప్రజలతోపాటు టీడీపీ కార్యకర్తలు సైతం నమ్ముతున్నారు. టీడీపీ చేపట్టిన నిరసనకు ఏమాత్రం స్పందన లేకపోవడమే ఇందుకు నిదర్శనం. తప్పు చేసిన వారు ఎవరూ తప్పించుకోలేరు. చట్టానికి ఎవరూ అతీతులు కారు.

– కిలపర్తి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, దేవరాపల్లి

చంద్రబాబు అవినీతి రుజువు కావడంతో అరెస్టు



గత ప్రభుత్వ హయాంలో స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అవినీతికి పాల్పడ్డ చంద్రబాబు నాయుడును అరెస్టు చేస్తే టీడీపీ నేతలు రాజకీయం చేయడం తగదు. రూ.371 కోట్లు పక్కదారి పట్టించినట్లు సీఐడీ అధికారులు బయటపెట్టారు. 40 సంవత్సరాలు రాజకీయ జీవితం అని చెప్పుకునే చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వ కుట్రగా ఆరోపించడం ఎంత వరకు సమంజసం. – సలాది అచ్చిమినాయుడు, రైతు, గాదిరాయి, మాడుగుల మండలం

చంద్రబాబు అరెస్టుపై రాజకీయం తగదు



స్కిల్ డెవలప్‌మెంట్ నిధులు దోచుకోని రాష్ట్ర ఖజానాకు గండికొట్టడం వల్ల మాజీ సీఎం చంద్రబాబును సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. దీనిపై టీడీపీ కార్యకర్తలు, ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు రాజకీయం చేయడం తగదు. చంద్రబాబు అరెస్టుతో ప్రభుత్వానికి గాని ముఖ్యమంత్రికి గాని ఎటువంటి సంబంధం లేదు. చట్టం తన పని తాను చేసుకుపోతోంది. రాష్ట్రంలో అలజడులు రేపడం టీడీపీకి, ఆ పార్టీ నేతలకు పరిపాటి అయిపోయింది.

– ఆడారి కన్నారావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు, కె.జె.పురం, మాడుగుల మండలం

ఎప్పడో జైలుకు వెళ్లాలి...



చట్టానికి చంద్రబాబు అతీతుడు కాడు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో కోట్ల రూపాయలు కాజేసినట్టు రుజువు కావడంతో సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. తప్పు చేస్తే అరెస్టు చేయటం మానేస్తారా అని ప్రశ్నించారు. 14 కేసుల్లో చంద్రబాబు స్టేలు తెచ్చుకుని కాలం వెళ్లదీస్తున్నాడు. లేకపోతే ఎప్పుడో జైలుకు వెళ్లాలి.

– కోనేటి రామకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్, నర్సీపట్నం

తప్ప ఎవరూ చేసినా శిక్ష తప్పదు



చట్టం ముందు అందరూ సమానులే. తప్పు ఎవరూ చేసిన శిక్ష తప్పదు. యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ పేరున అవినీతి చేసిన మాజీ సీఎం చంద్రబాబును అరెస్టు చేయడం సమంజసమే. తప్పు చేసి ఉంటే శిక్ష తప్పదు. దీనిని రాజకీయ కోణంలో కాకుండా అవినీతి కోణంలో చూడాలి. కోట్లాది రుపాయల అవినీతి జరిగిందని ఈడీ అరెస్టు చేయడం వల్ల చట్టాలపై ప్రజలకు నమ్మకం కలుగుతుంది.

– కొరుప్రోలు పాణీ శాంతారామ్, మాజీ ఎంపీటీసీ, గుండిపాల, గొలుగొండ మండలం

ప్రజాధనాన్ని దోచుకున్న చంద్రబాబు

ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్

కె.కోటపాడు: అనుభవం పేరుతో చంద్రబాబు ప్రజాధనాన్ని దోచుకున్నాడని ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ విమర్శించారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత పాలనలో స్కిల్ డెవలప్‌మెంట్ నిధులు రూ.118 కోట్లు దోచుకున్నట్లు గుర్తించి సీఐడీ అధికారులు చంద్రబాబును అరెస్ట్ చేయడం తప్పెలా అవుతుందన్నారు. ప్రజాధనాన్ని దోచుకున్న వారిపై కేసులు నమోదు చేస్తుండటాన్ని ప్రజలు హర్షిస్తున్నారన్నారు. చంద్రబాబు అరెస్టుతో టీడీపీ నాయకులు రోడ్లపై ధర్నాలకు దిగడం సిగ్గు చేటని విమర్శించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆదిరెడ్డి వెంకటరావు, వైఎస్సార్‌సీపీ యువజన, మహిళా విభాగం మండల అధ్యక్షులు గొర్రుపోటు వెంకటరావు, పైల అమ్మాజీ, సర్పంచ్‌లు బండారు ముత్యాలనాయుడు, చీపురుపల్లి అచ్చిబాబు, బోళెం సందీప్, బోళెం కృష్ణారావు, భూమిరెడ్డి దేముళ్లు, ఆదిరెడ్డి రామునాయుడు, బండారు లక్ష్మణరావు, దొగ్గ ఉమాశంకర్, ఏటుకూరి రాజేష్, గంతకర్ల సతీష్ పాల్గొన్నారు.

యధావిధిగా వ్యాపార కార్యకలాపాలు

నర్సీపట్నంలో కానరాని చంద్రబాబు అరెస్టు ప్రభావం



అబిద్‌సెంటర్ దుకాణాల సముదాయం వద్ద జనాలు



ప్రధాన కూడలిలో మోహరించిన పోలీసులు

నర్సీపట్నం: స్కిల్ డెవలమెంట్ స్కామ్‌లో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడును సీఐడీ అధికారులు అరెస్టు చేసిన నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. నియోజకవర్గంలో చెదురుముదురు సంఘటనలు మినహా చంద్రబాబు అరెస్టు ప్రభావం కానరాలేదు. నియోజకవర్గ కేంద్రమైన నర్సీపట్నంలో ధర్నాలు, రాస్తారోకో, అల్లర్లకు తావులేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నారు. పట్టణంలో వ్యాపార సముదాయాలు ఎప్పటి మాదిరిగానే తెరుచుకున్నాయి. ఆర్టీసీ బస్సులు యధావిధగా తిరిగాయి. చంద్రబాబు అరెస్టు ప్రభావం నర్సీపట్నంలో కానరాలేదు. సామాన్య ప్రజల్లో చంద్రబాబు అరెస్టు అంశం పెద్దగా కానరాలేదు. ఆయా వర్గాల ప్రజలు వారి వారి కార్యకలాపాల్లో నిమగ్నమయ్యారు. పట్టణంలో ప్రధాన కూడళ్లు, మండల కేంద్రాల్లో ఎక్కడికక్కడ పోలీసు పికెట్లు ఏర్పాటు చేసి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన పాల వ్యాన్

తప్పిన ప్రమాదం



పాల వ్యాన్ ఢీకొట్టడంతో నేలకూలిన విద్యుత్ స్తంభం

బుచ్చెయ్యపేట: పాల వ్యాన్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. శనివారం ఉదయం బుచ్చెయ్యపేట బల్క్ మిల్క్ కేంద్రం వద్దకు వస్తున్న విశాఖ డెయిరీ పాల వ్యాన్ అదుపుతప్పి పక్కనున్న స్తంభాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో స్తంభం విరిగిపోయి నేలకూలింది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం కాలేదు. స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించి సరఫరా నిలిపివేశారు. ఆ శాఖ అధికారులు వచ్చి విరిగిన స్తంభాన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేసి తిరిగి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

చంద్రబాబు నిర్దోషిగా కోర్టులో నిరూపించుకోవాలి



మాట్లాడుతున్న పార్టీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు

చీడికాడ: అధికారాన్ని అడ్డం పెట్టుకుని దోచుకోవడంలో టీడీపీ ఆరితేరిందని, ఆ విషయం ప్రజలందరికీ తెలుసునని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు తెలిపారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంటు స్కాంలో అడ్డంగా దొరికిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడును చట్ట ప్రకారం అరెస్టు చేస్తే ప్రతిపక్షాలు, పవన్ కల్యాణ్ తప్పుగా మాట్లాడటం శోచనీయమన్నారు. నిజంగా చంద్రబాబునాయుడు నిర్దోషి అయితే న్యాయస్థానంలో నిరూపించుకోవాలన్నారు. అంతేగాని సత్యవంతుడు అంటే ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. చేసిన తప్పును ఒప్పుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు యర్రా అప్పారావు, ఎంపీపీ కురచా నారాయణమూర్తి, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, యూత్ అధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు, పార్టీ నేతలు ఈర్లె చైతన్య, నందారపు రమణబాబు, కస్నూరి చెల్లంనాయుడు, పరువాడ మహేష్ పాల్గొన్నారు.

వాసవీ కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు

జంపెనలో అమ్మవారికి నోట్లతో అలంకరణ



వాసవీమాతకు పూజలు చేస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు మోహన్‌రావు దంపతులు



నోట్ల అలంకరణలో అమ్మవారు

మాడుగుల రూరల్: శ్రావణమాసం సందర్భంగా జంపెనలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం ప్రత్యేక కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పుట్టా మోహన్‌రావు ఆధ్వర్యంలో 40 ఏళ్లు దాటిన వారికి పాదపూజ చేశారు. అన్నసమారాధన ఏర్పాటు చేశారు. గ్రామస్తులతోపాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన రెండు వేల మంది భక్తులు హాజరై అన్నప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. కింతలి–గాదిరాయి వాసవీ క్లబ్ అధ్యక్షుడు మేడిశెట్టి అర్జునరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు మోహన్‌రావు, రీజనల్ చైర్మన్ ఆనపగడ్డ హరిబాబు, జోన్ చైర్మన్ శ్రీనాథు కన్నయ్యశెట్టి, కార్యదర్శి అనపగడ్డ చిన్నయ్య, కోశాధికారి పుట్టా కొండలరావు, శ్రీనాథు సతీశ్, బత్తుల సత్యారావు, పచ్చికూర శ్రీరామూర్తి, పి.నాగరాజు, పైడిరాజు, శ్రీరామూర్తి, రావల బ్రదర్స్, ఆనపగడ్డ సోదరులతోపాటు వాసవీ క్లబ్ సభ్యులు, వనితా క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయ భవన ప్రారంభోత్సవం నేడు

దేవరాపల్లి: స్థానిక గ్రామ సచివాలయం–2 భవనాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆదివారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి తెలిపారు. ముందుగా నూతన భవనం వద్ద పూజలు చేసి అనంతరం రిబ్బన్ కత్తిరించి ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి హాజరవుతారన్నారు.

రాజీమార్గమే ఉత్తమం



లోక్ అదాలత్ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి గంగరాజు

అనకాపల్లిటౌన్: రాజీమార్గమే రాజమార్గమని సీనియర్ సివిల్‌జడ్జి గంగరాజు అన్నారు. స్థానిక న్యాయ సముదాయంలో శనివారం లోక్‌అదాలత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. న్యాయ సముదాయాల్లో జరిగే లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొత్తం 2,345 కేసులు పరిష్కారమయ్యాయి. సివిల్ కేసులు 90, క్రిమినల్ కేసులు 2,255 పరిష్కారానికి నోచుకున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి ప్రదీప, మూడో అదనపు జూనియర్ సివిల్‌జడ్జి విజయలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయిలక్ష్మణ్, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలస్యంగా ఖరీఫ్ వరినాట్లు

వర్షాలతో దమ్ములకు సిద్ధమవుతున్న రైతులు



వర్షాలకు పంట భూముల్లో చేరిన నీరు



రోలుగుంటలో ముదిరిన వరి ఆకు



కొత్త మల్లంపేట మెరక ప్రాంతాల్లో నారు తీస్తున్న కూలీలు

రోలుగుంట: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట భూముల్లోను, చెరువుల్లోనూ నీరు చేరుతోంది. దీంతో మండలం రైతాంగం వరి నాట్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. వర్షభావ మండలం కావడంతో ఇప్పటి వరకూ భూముల్లో పదును లేక చెరువుల్లో నీరు చేరక ఖరీఫ్ వరిసాగు పనులు ఆలస్యమయ్యాయి. వాస్తవంగా మండలంలో 1,340 హెక్టార్లలో ఖరీఫ్ వరినాట్లు వేయాల్సి ఉంది. ఆయకట్టు చెరువుల వద్ద అనుకూలంగా ఉన్న భూముల్లోను, సాగునీరు అవకాశం ఉన్న కొమరవోలు ఆవ ప్రాంత పల్లపు భూముల్లోను, శరభవరం మల్లమ్మ చెరువు, బుచ్చింపేట పెదచెరువు తదితర ప్రాంతాల్లో ఇప్పటి వరకు 20 శాతం మాత్రమే నాట్లు పడ్డాయి. సాగునీటి వసతి లేక, అనుకూల వర్షాలు లేక వరి నారుమడులు సైతం ఎండిపోయిన పరిస్థితుల నుంచి మోటారు ద్వారా నీటి తడులు వేసుకుని సంరక్షించుకున్నారు. వరినాట్లపై రైతాంగం కలవరం చెందుతున్న నేపథ్యంలో మూడు రోజులుగా వర్షాలు పడి సాగుకు అనుకూలం ఏర్పడింది.

మెరక ప్రాంతాల్లో వరినాట్లు

గొలుగొండ: వర్షాలకు మెట్ట ప్రాంతాల్లో వరినాట్లు వేయడంలో రైతులు బిజీబిజీగా ఉన్నారు. వర్షాలు సరిగా లేకపోవడతో కొత్తమల్లంపేట, చిన్నయ్యపాలెం, దారపాలెం, నిమ్మగెడ్డ మెరక భూముల్లో నాట్లు వేయలేదు. ఈ నేపథ్యంలో నాలుగు రోజులు నుంచి కురుస్తున్న వర్షాలతో ప్రస్తుతం నాట్లు వేస్తున్నారు. నాట్లు ఆలస్యం కావడంతో కాస్త దిగుబడులు తగ్గుతాయని రైతులు వాపోతున్నారు.

నష్టపరిహారం చెల్లించి రోడ్డు విస్తరిస్తాం

నర్సీపట్నం ఆర్డీవో జయరాం



సమావేశమైన ఆర్డీవో జయరాం, మున్సిపల్ కమిషనర్ కనకారావు

నర్సీపట్నం: భూసేకరణ చేసి భవన యజమానులకు నష్టపరిహారం చెల్లించి, మెయిన్ రోడ్డును వందడుగులకు విస్తరిస్తామని ఆర్డీవో హెచ్.వి.జయరాం తెలిపారు. భూసేకరణపై స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కనకారావుతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నర్సీపట్నం మెయిన్ రోడ్డు వందడుగుల విస్తరణపై భూసేకరణ ద్వారా నష్టపరిహారం చెల్లించాలని భవన యజమానులు కోర్టును ఆశ్రయించారన్నారు. భవన యజమానుల అభ్యర్థన మేరకు ల్యాండ్ ఎక్విజేషన్ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఆ మేరకు భూసేకరణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

దేవస్థానం అభివృద్ధికి కృషి: మంత్రి



మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను సత్కరిస్తున్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ సకలా రాజ్యలక్ష్మీ గోవిందరావులు

అనకాపల్లిటౌన్: స్థానిక దేమునిగుమ్మం వేంకటేశ్వర స్వామి దేవస్థానం నూతన కమిటీ చైర్ పర్సన్‌గా నియమితులైన సకలా రాజ్యలక్ష్మీ గోవిందరావు మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను మిందిలోని ఆయన స్వగృహంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేయడం జరుగుతుందన్నారు. నూతన కమిటీ సభ్యులతో త్వరలో సమావేశం నిర్వహించి దేవస్థానం అభివృద్ధి, భక్తులకు మౌలిక సదుపాయాలపై చర్చించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం నూతన కమిటీ సభ్యులు శ్రీధరాల కోమలి రామ్మోహనరావు, సూరిశెట్టి చినసన్యాసిరావు, సుంకర వెంకటేశ్వరరావు, ఉమ్మిని పైడిరాజు, రాజాన లక్ష్మీశ్రీనివాసరావు, లింగం అనురాధ, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కడిమిశెట్టి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానానికి తోడపెద్దు అందజేత



సూరిశెట్టి వారి కుటుంబ సభ్యులకు తోడపెద్దును అందజేస్తున్న రమణమూర్తి

అనకాపల్లిటౌన్ : గవరపాలెం చిన్నరామస్వామి దేవస్థానంలో సూరిశెట్టి వారి కుటుంబ సభ్యులకు అనంతపురం జిల్లా నుంచి తీసుకువచ్చిన తొడపెద్దును శనివారం దేవస్థానం చైర్మన్ వి.వి.రమణమూర్తి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుమాసాల క్రితం దేవస్థానంలో ఉన్న తొడపెద్దు అనారోగ్య కారణంగా మృత్యువాత పడిందన్నారు. పూర్వకాలం నుంచి దేవస్థాన ఆవరణలో తొడపెద్దు ఉండేదని ఆయన చెప్పారు. నిత్యం దేవస్థానం ఆవరణలో తొడపెద్దుకు పూజాకార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం నిర్వాహకులు సత్యానారాయణమూర్తి, మళ్ల సన్యాసినాయుడు, పీలా సోంబాబు, మళ్ల అంజిబాబు పాల్గొన్నారు.